సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 10 । జనవరి । 2025



'ఎల్లంపల్లి'లో మొసళ్లు

IIలో▸

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో మత్స్యకారులకు మొసళ్లు కనిపించాయి. దీంతో చేపల వేటకు వెళ్లేందుకు వారు జంకుతున్నారు.



కూరగాయల సాగులో ఆదర్శం

కొద్దిపాటి భూమిలోనే రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. అధిక లాభాలు గడిస్తూ తోటి రైతులందరికీ వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు.

IIIలో▸

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా, అప్పుడప్పుడు పూర్తిగా మేఘావృతమవుతుంది. చలి కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: యువజనోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఫోక్ గ్రూప్ డ్యాన్స్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, సూపరింటెండెంట్ కరుణాకర్, కొరియోగ్రాఫర్ దత్తు విద్యార్థులను అభినందించారు. సిబ్బంది గోపాల్, స్వప్న, అనిత, సంతోషిణి, భువన తదితరులున్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్యాలు తీసుకోవడంతో అనర్థాలు కలుగుతాయని మానసిక వైద్యుడు శ్రీనివాస్ తెలిపారు. మిషన్ పరివర్తన్ నిషా ముక్త్ భారత్‌లో భాగంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీలకు మాస్టర్ వలంటీర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాల గురించి యువత, ప్రజలు, సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ తీసుకున్న వారికి విముక్తి కలిగించే రిహాబిలేషన్ సెంటర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ అధికారి సుధాకర్, జిల్లా సంక్షేమాధికారి సబిత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయికిరణ్, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ




కాంస్య పతకం సాధించిన విద్యార్థినులు

నేరడిగొండ: జాతీయ స్థాయిలో నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చాటారు. మహారాష్ట్రలో ఈనెల 5 నుంచి 9వరకు జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–17 పోటీల్లో తెలంగాణ బాలికల జట్టు తరఫున ఆర్.శ్రీలేఖ, ఎం.శ్రీనిత్య పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. వీరిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ స్వామి, ఎస్వో రజిత, పీఈటీ స్నేహ, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసుల పనితీరు ఆన్‌లైన్‌లో తెలుపాలి

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల పనితీరును ఆన్‌లైన్‌లో తెలుపాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తెలుపడానికి జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్‌తో కలిసి గురువారం క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇదివరకు రాష్ట్ర పోలీసుల సేవలపై అవుట్ సోర్సింగ్ సిబ్బంది ప్రజలకు కాల్ చేసి అభిప్రాయాలు సేకరించేవారని తెలిపారు. ప్రస్తుతం పిటిషన్ ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ తదితర అంశాలపై పోలీస్ అధికారుల ప్రతిస్పందన, ప్రవర్తన, వారి అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. అధికారులు సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు రేటింగ్ ఇస్తారని తెలిపారు. క్యూఆర్ కోడ్ జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు విస్తరిస్తోంది!

శరీరంపై స్పర్శలేని మచ్చలు (ఫైల్)





- క్రమంగా పెరుగుతున్న కేసులు
- అవగాహన లేకపోవడంతోనే..
- 11 మందికి వ్యాధి నిర్ధారణ
- జిల్లాలో 65కు చేరిన కేసులు

పీహెచ్‌సీల వారీగా కేసుల వివరాలు

పీహెచ్‌సీ	కేసుల సంఖ్య
అంకోలి	13
గుడిహత్నూర్	4
ఇచ్చోడ	1
నర్సాపూర్(టి)	1
బజార్‌హత్నూర్	3
సొనాల	2
తాంసి	4
భీంపూర్(టి)	5
తలమడుగు	6
గిమ్మ	4
జైనథ్	2
బేల	5
సైద్‌పూర్	3
దంతన్‌పల్లి	3
ఇంద్రవెల్లి	3
ఝరి	1
శాంతినగర్	1
ఖుర్షీద్‌నగర్	1
చిల్కూరిలక్ష్మీనగర్	3
మొత్తం	65

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కుష్ఠు క్రమంగా విస్తరిస్తోంది. నెలనెలా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. అవగాహన లేమితో జనాలు వ్యాధి బారిన పడుతున్నారు. స్వతహాగా పరీక్షలు చేసుకునేందుకు జనాలు ముందుకు రావడం లేదు. కుష్ఠు నిర్ధారణ పరీక్షలు చేసినప్పుడే కేసులు బయట పడుతున్నాయి. గత డిసెంబర్‌లో జిల్లాలో వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం చేపట్టారు. వ్యాధి లక్షణాలున్న 895 మంది అనుమానితులను గుర్తించారు. వారిలో 11మందికి వ్యాధి నిర్ధారణైంది. ఇంకా వ్యాధిగ్రస్తులున్నట్లు వైద్యాధికారులు అనుమానిస్తున్నారు. సకాలంలో పరీక్షలు చేసుకుంటే వ్యాధి ముదరకుండా నయం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి కావడంతో ఆందోళన కలిగిస్తోంది. తగిన సమయంలో చికిత్స తీసుకోకుంటే దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. అవగాహన లేమి, నిరక్షరాస్యత కారణంగా వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 65 కేసులున్నట్లు తెలిపారు.

సర్వేతో బయటపడ్డ కేసులు

డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో కుష్ఠు గుర్తింపు ఉద్యమం చేపట్టారు. 1,002 మంది ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లాలో 1,75,600 గృహాలుండగా, 7,32,721 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 895 మందిని అనుమానితులుగా గుర్తించారు. తర్వాత పీహెచ్‌సీల వారీగా వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించగా 11 మందికి కుష్ఠు నిర్ధారణైంది. గత నవంబర్‌లో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ప్రతినెలా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి సర్వేలో తాంసిలో–1, తలమడుగులో–2, జైనథ్‌లో–2, భీంపూర్‌లో–1, గిమ్మలో–1, ఇంద్రవెల్లిలో–1, అంకోలిలో–3 చొప్పున కేసులు నమోదయ్యాయి. అయితే ఈ పీహెచ్‌సీలతో పాటు బేల, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోనూ కేసులు పెరుగుతున్నాయి. 2024 మార్చిలో మొదటి విడత సర్వే చేపట్టినప్పుడు 16 కేసులు నమోదయ్యాయి. ఈసారి 11 కేసులు బయటపడటంతో వ్యాధి తీవ్రత పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇంకా కుష్ఠు కేసులు పెరిగే అవకాశమున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

ఎలా వ్యాపిస్తుందంటే..

కుష్ఠు వ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రై అనే బ్యాక్టీరియాతో సోకుతుంది. శరీరంలోని అన్ని అవయవాలకు వ్యాప్తి చెందుతుంది. సరైన సమయంలో వైద్యం చేయించుకోకపోతే ఒకరినుంచి మరొకరికి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంపై ఒకటి నుంచి ఐదు స్పర్శలేని మచ్చలుంటే పాసిబ్యాసెల్లరింగ్ అని పేర్కొంటారు. దీని నివారణకు ఆరు నెలల వరకు చికిత్స అందిస్తారు. ఆరు కంటే ఎక్కువ మచ్చలుండి, నరాలు ఉబ్బితే మల్టీ బ్యాసిలరీగా నిర్ధారిస్తారు. దీని నివారణకు సంవత్సరం వరకు చికిత్స అందిస్తారు. ఈ వ్యాధి సోకిన తర్వాత 3 నుంచి 15 సంవత్సరాల తర్వాత దుష్పరిణామాలు బయటపడతాయి. తొలి దశలో వ్యాధిని నిర్ధారించుకుని చికిత్స పొందితే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చు. శరీరంలో ఎరుపు రంగు, రాగి రంగు మచ్చలు స్పర్శ లేకుండా ఉంటే వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారిస్తారు.

నివారణ చర్యలు చేపడుతున్నాం



కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. గత డిసెంబర్‌లో ఆశ కార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించాం. జిల్లాలో 895 మందిని అనుమానితులుగా గుర్తించగా 11 మందికి వ్యాధి నిర్ధారణైంది. జనాలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటే వ్యాధి ముదరకముందే చికిత్స అందించే అవకాశముంటుంది. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం 65 మంది వ్యాధిగ్రస్తులున్నారు. కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం

- కలెక్టర్ రాజర్షిషా
- పోలీస్ క్రీడలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరేడ్ మైదానంలో ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌తో కలిసి గురువారం పోలీస్ వార్షిక క్రీడలను ప్రారంభించారు. పరేడ్ మైదానంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు బృందాలుగా ఉన్న డీఏఆర్ ఈగల్స్, క్యూఆర్టీ విక్టర్స్, ఆదిలాబాద్ స్ట్రైకర్స్, ఉట్నూర్ ఛాలెంజర్స్, హెచ్‌జీ హంటర్స్ పరేడ్ నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనం చేశారు. అనంతరం స్పోర్ట్స్ జెండాలు ఆవిష్కరించి శాంతికపోతాలు, బెలూన్లు గాలిలోకి వదిలి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో నిమగ్నమైన పోలీసులకు ఆటవిడుపుగా వార్షిక క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. పోలీసులు ఉల్లాసంగా వార్షిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు. మూడురోజులపాటు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ వాలీబాల్, క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. అలాగే వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిక్షయ్ శివిర్ వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బందికి టీబీ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని కలెక్టర్, ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ బీ సురేందర్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, హసిబుల్లా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రా జర్షిషా కేక్ కట్ చేసి అంధులకు తినిపించా రు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పగలు విద్యార్థులకు బోధిస్తూ, రాత్రులు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లి పి తయారీ కోసం లూయిస్ బ్రెయిలీ కృషి చేశారని కొనియాడారు. జిల్లా సంక్షేమాధికా రి సబిత, ఏపీడీ మిల్కా తదతరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి పాటుపడాలని రాష్ట్రీయ జనజాతి పర్ధాన్ ఉద్ధన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్, జిల్లా అధ్యక్షుడు మెస్రం శంకర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించి మాట్లాడారు. హీరా సుక్కా జయంతిని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. హీరా సుక్కా జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలు, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సీఎంను కలిసి వినతిపత్రాలు ఇచ్చే షెడ్యూల్‌ను ఖరారు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఉట్నూర్‌లో నిర్వహించనున్న సమావేశానికి ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందినవారంతా అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు గేడం మాధవ్, కోశాధికారి సెడ్మకి సుభాష్, డివిజన్ అధ్యక్షుడు మడావి దిగంబర్, నాయకులు ఆనంద్‌రావ్, భాస్కర్, దేవిదాస్, సత్యనారాయణ, శేషరావ్, యాదవ్‌రావ్, తానాజీ, అనసూయ, భారతీబాయి, గిరిజాబాయి తదితరులున్నారు.

పొగాకు ఉత్పత్తులు వాడొద్దు



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ శ్రీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: పొగాకు ఉత్పత్తులను వినియోగించవద్దని, పొగాకు రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ సూచించారు. పొగాకు రహిత విద్యాసంస్థల ఏర్పాటులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు ఉత్పత్తుల వినియోగంతో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడితే తల్లిదండ్రులు మానసిక నిపుణులకు చూపించాలని, లేదా 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత కౌన్సెలింగ్ పొందవచ్చని సూచించారు. ప్రిన్సిపాల్ అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు, లెక్చరర్లు చవాన్ అనిత, సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను పరిరక్షించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్: ప్రాచీన కళలను పరిరక్షించాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ఆవరణలో మంథనం ఒక సంకల్పం కళా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జడకొప్పులాట వేడుకలను బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడకొప్పులాటతో శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. చిన్నారుల్లో ఆసక్తిని గమనించి తల్లిదండ్రులూ ప్రోత్సహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. సంప్రదాయ కళలపై చిన్నారులకు పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో భారతీయ కళల రక్షణకు వారు కృషి చేస్తారని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా సాంస్కృతిక వేదిక వారు కృషి చేస్తుండడం అభినందనీయమని కొనియాడారు. వేదిక నిర్వాహకులు అల్లూరి సంజీవరెడ్డి, నిషికాంత్ దేశ్పాండే తదితరులున్నారు.

ఇన్‌చార్జి డీఈవోగా వేణుగోపాల్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌చార్జి డీఈవోగా కే వేణుగోపాల్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు డీఈవోగా పనిచేసిన ప్రణీతకు గుండెపోటు రావడంతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆమె కోలుకునే వరకు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మండలంలోని యాపల్‌గూడ 2వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్ సూచించారు. శిక్షణ తీసుకున్న 412 మంది కానిస్టేబుళ్లు బుధవారం సాయంత్రం బెటాలియన్‌లో రిపోర్టు చేశారు. దీంతో గురువారం వారితో సమావేశం నిర్వహించి వారి విధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎస్.పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, ఏజేపీ నారాయణ, దేవిదాస్ రాథోడ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుభాషిణి, సిబ్బంది ఉన్నారు.

'ముక్కోటి'కి ముస్తాబు

- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ముస్తాబవుతున్న వేంకటేశ్వరాలయం

ఆదిలాబాద్: హిందూ సంప్రదాయంలో దాదాపు ప్రతీ పండుగను చాంద్రమానం ప్రకారం జరుపుకొంటారు. అయితే వైకుంఠ ఏకాదశిని మాత్రం సూర్యుడి కదలికల ఆధారంగా జరుపుకోవడం విశేషం. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి సూర్యుడు ప్రవేశించిన రోజే ముక్కోటి ఏకాదశిని నిర్వహిస్తారు. ఈ పర్వదినం నాడే ముక్కోటి దేవతలంతా శ్రీమహావిష్ణువును దర్శించుకోవడానికి ఉత్తర ద్వారం ద్వారా వెళ్లినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఉత్తర ద్వారం ద్వారా శ్రీమహావిష్ణువును దర్శించుకుంటే ముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే ఏకాదశి రోజున వైష్ణవాలయాలకు భక్తులు బారులు తీరుతారు.

ఉత్తరద్వార దర్శనం.. ముక్తి మార్గం

మురుసాసురుడు అనే రాక్షసుని బాధలు తట్టుకోలేక దేవతలు శ్రీమహావిష్ణువుకు మొరపెట్టుకుంటారు. స్వామివారు ఆ రాక్షసుని పీడను తొలగించడానికి స్వయంగా ముక్కోటి దేవతలతో కలిసి భూమి మీదకు వచ్చారని పురాణాలు చెబుతున్నాయి. ఆ రాక్షసున్ని సంహరించి దేవతల ఇబ్బందులు తొలగించినట్లు చెబుతారు. దేవతలంతా ఉత్తర ద్వారం ద్వారా శ్రీమహావిష్ణువును శుక్ల ఏకాదశి నాడే దర్శించుకున్నారని, స్వామివారిని వైకుంఠ ఏకాదశి నాడు దర్శించుకుంటే సకల సమస్యలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. అలాగే ఈ ద్వారం గుండా స్వామివారి దర్శనం చేసుకుంటే పునర్జన్మ ఉండదని ముక్తి లభిస్తుందని ప్రతీతి.

'ముక్కోటి'కి సర్వం సిద్ధం

వైకుంఠ ఏకాదశికి సంబంధించి జిల్లా కేంద్రంలోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర దేవాలయానికి ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. అలాగే పట్టణంలోని మంగమఠంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఉత్తర ద్వారాన్ని ఏర్పాటు చేశారు.


టీపీవో ఉద్యోగం సాధించిన నీలవేణికి సత్కారం



నీలవేణిని సత్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉచిత శిక్షణ తీసుకుని జోనల్‌లో ఫస్ట్ ర్యాంక్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన నీలవేణిని గురువారం స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది శాలువాతో సత్కరించి పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉచిత శిక్షణ పొందిన నీలవేణి జోనల్ స్థాయి ఉద్యోగం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు నీలవేణిని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ కొలువులు సాధించాలని సూచించారు. తమ స్టడీ సర్కిల్ సెంటర్‌లో లైబ్రరీ సౌకర్యం ఉందని తెలిపారు. అందులో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీలవేణితోపాటు తమ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉచిత శిక్షణ పొందిన 151 మంది అభ్యర్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు.

పీఎం కుసుమ్ యోజనతో లబ్ధి



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్లు, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పీఎం కుసుమ్ యోజన పథకంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట పొలాల్లోనే సోలార్ పంపులు ఏర్పాటు చేసి లాభాలు పొందే అవకాశముందని తెలిపారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ఆయా మండలాల్లో సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు కిలో మీటర్ల దూరంలో తహసీల్దార్, ఏపీఎం, ఏఈలు కలిసి స్థల సేకరణ చేయాలని సూచించారు. జిల్లాలో 150 ఎకరాల స్థలం లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, ఎండోమెంట్ లీజు భూములను సర్వే చేసి స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. తహసీల్దార్ల ద్వారా మండలాల్లోని సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రభుత్వ భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థల సేకరణ వేగవంతం చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అనంతరం ధరణికి సంబంధించి టెక్నికల్, యూజిబిలిటీ లెంజ్ స్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చనాఖా–కొరాటా ప్రాజెక్టు 600 ఎకరాలప్రయార్టీ బేసిస్ ల్యాండ్ ఎక్విప్ పేమెంట్‌పై సమీక్షించారు.

‘ఎల్లంపల్లి’లో మొసళ్లు

- ప్రాజెక్టులో సంచారం
- ఇటీవల బ్యాక్‌వాటర్‌లో మొసలి పిల్ల
- చేపలవేట వెళ్లేందుకు జంకుతున్న మత్స్యకారులు



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లోకి మొసలి పిల్లని వదులుతున్న అటవీ రేంజ్ అధికారి సునీత



రాపల్లి శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో లభించిన మొసలి పిల్ల (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మొసళ్ల కలకలంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో మొసళ్లు జాలర్ల కంట పడుతుండటంతో చేపలు పట్టేందుకు జంకుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఓ మత్స్యకారుడి వలకు మొసలి చిక్కడంతో భయాందోళనకు గురై వదిలిపెట్టాడు. ఆ మొసలి ముళ్లపొదల్లోకి వెళ్లిపోయింది. వలకు చిక్కిన మొసలి ఒకటే అనుకున్న జాలర్లకు ప్రాజెక్ట్‌లో వీటి ఆనవాళ్లు కనిపించాయి. ఇవి మూడు వరకు ఉంటాయని అంటున్నారు. దీంతో చేపలు వేటకు వెళ్లాలంటే మత్స్యకారులు భయపడుతున్నారు. పదుల సంఖ్యలో మొసళ్లు సంచరిస్తున్నాయని వెనకడుగు వేస్తున్నారు. అయితే పగటిపూట చేపల వేటకు వెళ్లినా వచ్చేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామని అంటున్నారు. మరోవైపు ప్రాజెక్ట్‌లోని మత్స్య సంపదను మొసళ్లు తినేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బావుల్లో సర్వసాధారణం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపు గ్రామాలకు చెందిన పలు నిర్వాసితులకు సంబంధించి బావులు బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయాయి. వ్యవసాయ క్షేత్రాలకు చెందిన బావులు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్ట్‌లో నిత్యం మొసళ్లు అటూ ఇటూ తిరుగుతూ బావుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. గతంలో వ్యవసాయ బావుల్లో పడిన మొసళ్లను అటవీ అధికారుల సహాయంతో బయటకు తీసి ప్రాజెక్ట్‌లోకి తిరిగి వదిలిపెట్టారు.

ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో..

‘ఎల్లంపల్లి’లో ఓ మత్స్యకారుడు చేపలు పట్టేందుకు చేసిన వినూత్న ఆలోచనకు ఏకంగా మొసలి చిక్కింది. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కునారపు రామయ్య ఇటీవల చేపలు పట్టేందుకు వెదురుతో ఓ బుట్ట తయారు చేసి బ్యాక్‌వాటర్‌లో పెట్టాడు. రెండు రోజుల తర్వాత బుట్ట చూడగా మొసలి పిల్ల చిక్కుకుంది. బుట్టతో సహా మొసలిని రామయ్య ఇంటికి తీసుకువెళ్లాడు. స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని మొసలిని చూసి ఆనందపడ్డారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఆరునెలల మొసలితో ఉన్న బుట్టను ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో వదిలిపెట్టారు.

భయంగా ఉంది



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో పదుల సంఖ్యలో మొసళ్లు ఉన్నాయి. జాలర్లకు మొసళ్లు కనిపించాయి. ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలి. – బొగ్గుల చంద్రశేఖర్, మత్స్యకారుడు, నంనూర్

పతంగులు ఎగురవేసే వేళ జాగ్రత్త

- చైనామాంజా వాడొద్దు
- స్తంభాలు, తీగల వద్ద గాలిపటాలు ఎగురవేయొద్దు
- బహిరంగ ప్రదేశాల్లో ఎగురవేయాలి

దండేపల్లి: సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ. పల్లెల్లో ఇప్పటి నుంచే పతంగుల సందడి ఊపందుకుంది. దుకాణాల్లో రంగురంగుల పతంగులు విక్రయిస్తున్నారు. దీంతో పాఠశాలకు సెలవు వస్తే చాలు విద్యార్థులు గాలిపటాలు ఎగరేస్తున్నారు. చిన్నా పెద్దలు పతంగులు ఎగురవేయడంపై ఆసక్తి చూపిస్తుంటారు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లల కేరింతలు హోరెత్తుతాయి. పతంగులు కొత్త పుంతలు తొక్కే క్రమంలో చైనా మాంజా దారం వచ్చింది. దీని ద్వారా పక్షులకు, వ్యక్తులకు హాని జరుగుతుందనే అటవీశాఖ 2007లో నిషేధించింది. పూర్తిస్థాయి నిషేధం అమలు కాకపోవడంతో అక్కడక్కడ మాంజా దొరకడం, పతంగులకు కట్టి ఎగిరేయడం సాధారణంగా మారింది. పలుచోట్ల పతంగులను ప్రమాదకర ప్రాంతాల్లో ఎగురవేస్తూనే ఉన్నారు. పండుగ వేళల్లో జాగ్రత్తలు పాటించకుంటే విషాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

- శిథిల భవనాలు, రక్షణ గోడలేని భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, నీటి ట్యాంకుల పైకి ఎక్కి పతంగులు ఎగరవేయొద్దు.
- సీసీ దారులు, రహదారులు వద్ద దారం, మాంజా దారం వేలాడుతూ కనిపిస్తే తీసివేయాలి. లేకుంటే వాహనదారులు, పాదాచారులకు తగిలి గాయాలయ్యే పరిస్థితి ఉంది.



రక్షణ గోడలేని భవనంపై పతంగులు ఎగరేస్తున్న చిన్నారులు

- బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల దగ్గరగా గాలిపటాలు ఎగురవేయడం ప్రమాదకరం.
- విద్యుత్ తీగల మీద పడిన గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించారు.
- మెటాలిక్ దారాలు వినియోగించడం వల్ల విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది.

చైనామాంజాపై నిషేధం

పంతంగులు ఎగురవేసేటప్పుడు చైనా మాంజాదారాలు వాడొద్దు. వాటితో పక్షులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. చైనా మాంజా దారాన్ని అటవీశాఖ నిషేధించింది. దీనిపై ఇప్పటికే కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాం. చైనా మాంజా దారాలు విక్రయిస్తే చర్యలు తప్పవు.
– సుమ్మరావు, ఎఫ్ఆర్వో, తాళ్లపేట

క్లుప్తంగా

పత్తి చేనులో మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి పంచాయతీలోని కొత్తపల్లి శివారు గల పత్తి చేనులో గుర్తుతెలియని కుళ్లిన మృతదేహం లభ్యమైంది. ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. వేంపల్లికి చెందిన మొగిళి సత్యం కొత్తపల్లి శివారులో పత్తి సాగు చేస్తున్నాడు. గురువారం పత్తిని ఏరేందుకు సమాయత్తం కాగా ఆ చేను నుంచి దుర్వాసన వచ్చింది. పరిసరాలు పరిశీలించగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఎత్తు దాదాపు 5.6 ఫీట్లు ఉండి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్టు

దండేపల్లి: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన ఎంబడి సురేందర్ కొందరు రైతుల నుంచి మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేశాడు. ఆ ధాన్యాన్ని ఈనెల 2న జమ్మికుంట మిల్లుకు తరలించే క్రమంలో ఫాం నంబర్ 10లో ప్రత్యేకాధికారి తహసీల్దార్ సంధ్యారాణి సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. పక్కా సమాచారం మేరకు ఆర్ఐ భూమన్న లారీని గూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకుని తనిఖీ చేయగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తేలింది. ఆర్ఐ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇటీవల రోడ్డుపై బైఠాయించి ప్రయాణికులకు ఇబ్బంది కల్గించిన 15 మంది బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. గురువారం నాయకులను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్(ట్రెసా) 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్‌లతో కలిసి కలెక్టరేట్ చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఏవో మధుకర్, జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాహారదీక్షకు సంఘీభావం



దీక్షలో కూర్చొన్న సోఫీనగర్ వాసులు

సోన్: తమ గ్రామానికి సర్వీసు రోడ్డు నిర్మించాలని మండలంలోని కడ్తాల్ గ్రామస్తులు 32 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు గురువారం నిర్మల్‌లోని సోఫీనగర్ కాలనీవాసులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వీసు రోడ్డు నిర్మించే వరకు తమ పోరాటం ఆదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోఫీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చిన్నయ్య, నరేశ్, గణేశ్, సంతోష్, కడ్తాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి



మడావి భీంరావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని దుబ్బగూడలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం దావెన్‌గూడ గ్రామానికి చెందిన మడావి బాదిరావ్, మాడ్కుబాయి దంపతులకు చెందిన ఐదుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు మడావి భీంరావ్ ఉన్నాడు. భీంరావ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్తున్న తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. ఇంద్రవెల్లి మండలంలోని దుబ్బగూడలో ఉంటున్న తన అక్క యేర్మ సీతాబాయి ఇంటికి రెండు రోజుల క్రితం భీంరావ్ వెళ్లాడు. గురువారం అక్క ఇంట్లో ఉయ్యాల తాడును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలైన భీంరావ్‌ను బంధువులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి బాదిరావ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాంగ్విలో రైతు..

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం ..పంతుల భూమన్న (69) ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం తన పంట చేనుకు వెళ్లాడు. నీరు పెట్టేందుకు మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఎంతకీ భూమన్న ఇంటికి రాకపోవడంతో బంధువులు చేనుకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య అడెల్లా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భూమన్న మృతదేహం

కుర్మపల్లి చెరువు వద్ద ఒకరు..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి చెరువు వద్ద బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి ఒకరు మృతిచెందాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామానికి చెందిన ఆర్.సురేష్ (35) ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కుర్మపల్లి చెరువు వద్ద ఓ విద్యుత్ స్తంభం పైకి ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపోయాడు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేస్లాపూర్‌కు చేరిన ప్రచార రథం



మెస్రం వంశీయుల ప్రచార రథం

ఇంద్రవెల్లి: నాగోబా జాతరపై ప్రచారం నిర్వహించేందుకు ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి ప్రారంభించిన ప్రచారరథం తిరిగి గ్రామానికి చేరుకుంది. ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లోని మెస్రం వంశీయులున్న గ్రామాలకు ప్రచారం రథం వెళ్లింది. దీని ద్వారా ప్రచారం నిర్వహించిన కటోడ మెస్రం కోసేరావ్, పర్ధాన్ మెస్రం దాదారావ్ గురువారం సాయంత్రం కేస్లాపూర్ గ్రామానికి చేరారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్దకు చేరి పవిత్ర గంగాజలం కోసం పాదయాత్ర ప్రారంభిస్తారని నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



కాలుతున్న పత్తి

వాంకిడి: మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద గల ఆర్‌బీ ఇండస్ట్రీయల్ జిన్నింగ్ మిల్లులో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి లోడుతో మిల్లుకు వచ్చిన బొలెరో వాహనంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే వాహనాన్ని బయటకు తీసుకెళ్లే క్రమంలో మిల్లులో పత్తి కుప్పలకు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన కార్మి కులు నీళ్లు చల్లి మంటలార్పారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు 10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని సీసీఐ అధికారి పన్నాలాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ మృతి



ఆత్రం మారుతి (ఫైల్)

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన యేమునబాయి, ఆత్రం మారుతి(25) అక్కాతమ్ముళ్లు. వీరి చిన్నవయసులో తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. అక్కాతమ్ముళ్లు ముత్నూర్‌లోని అమ్మమ్మ వద్ద పెరిగారు. ఉట్నూర్ మండలం సాలేవాడకు చెందిన నైతం మనోహర్‌తో యేమునబాయికు పెళ్లయింది. ముత్నూర్‌లోని జైస్వాల్ నితిన్ వద్ద మారుతి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మారుతి బుధవారం ధర్మసాగర్ గ్రామంలోని ఓ రైతు పత్తిని వాహనంలో లోడ్ చేసి సాయంత్రం మండలంలోని ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఏమాయికుంట వద్ద కుక్కను తప్పించపోయి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న కిరాణా షాపుని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారుతిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ (25) బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం.. ఈనెల 1న శ్రీకాంత్ బైక్‌పై తన అత్తగారిల్లు అయిన కౌటాల మండలంలోని కన్నెపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గత మూడురోజులుగా జ్వరం రావడంతో అత్తారింట్లో ఉంటున్నాడు. చికిత్స నిమిత్తం బుధవారం రాత్రి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన కుమారుడిని అత్తింటివారు దాడి చేసి చంపేశారని, మృతదేహంపై గాయాలు ఉన్నాయని తల్లి నానుబాయి ఫిర్యాదు చేసింది. ఈమేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య భాగ్య, కుమారుడు రాము, కుమార్తె శ్రీదివ్య ఉన్నారు.

భార్యతో గొడవ.. టవరెక్కిన భర్త

ఉట్నూర్‌రూరల్: భార్యతో గొడవపడిన భర్త టవరెక్కి హల్‌చల్ చేశాడు. మండలంలోని బీర్సాయిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. బీర్సాయిపేటకు చెందిన మంగం తిరుపతి, జ్యోతి భార్యభర్తలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి తిరుపతి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్యభర్తమధ్య గొడవ జరిగింది. గురువారం బీర్సాయిపేట పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న టవర్ ఎక్కి తిరుపతి రెండు గంటల పాటు హంగామా చేశాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతనికి నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. అనంతరం తిరుపతిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. జైనూర్ మండలంలోని గౌరీ గ్రామానికి చెందిన సిడం భరత్ తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. 2021 అక్టోబర్ 14న అప్పటి ఎస్సై తిరుపతి తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. భరత్‌ను విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అప్పటి సీఐ హనూక్ కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్ సాక్షులను కోర్టులో హాజరుపర్చి నేరం రుజువు చేశారు. ఈమేరకు నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్సై సాగర్, లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ



ట్విన్‌సిటీస్-స్పోర్ట్స్ స్కూల్ మధ్య మ్యాచ్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- రాష్ట్ర స్థాయి అండర్‌–13 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

రామకృష్ణాపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఖేలో ఇండియా తెలంగాణ స్థాయి అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే పోటీలకు సౌత్ జోన్ పరిధిలోని ఆయా జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపీ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాపతాకాల ఆవిష్కరణ అనంతరం వివిధ జిల్లాల జట్లు గౌరవ వందనం సమర్పించాయి. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గెలుపోటములను లెక్క చేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. తనకు కూడా చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టమని, ఒలింపిక్స్ స్థాయిలో రాణించేలా తెలంగాణ క్రీడాకారులు తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, మందమర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్, సీఐ శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపతి రాజయ్య, అజీజ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఉత్సాహంగా..

అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో తొలిరోజు రెండు లీగ్‌మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ సిద్దిపేట జట్టుపై కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ జట్టు విజయం సాధించింది.

జంగున్‌బుయ్యారి వద్ద ఆదివాసీల పూజలు



పూజలు చేస్తున్న రాంజీగూడ ఆదివాసీలు



గంగస్నానానికి బయల్దేరి వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పరస్కరించుకొని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి, భీమాల్ దేవుడు, పెర్సపేన్ (పెద్ద దేవుడు) పూజలను ఆదివాసీలు నిర్వహిస్తున్నారు. అనంతరం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దేవతలకు గంగస్నానాలు ఆచరించి తమ తమ గ్రామాలకు చేరుకుని పూజలు చేస్తున్నారు. మండలంలోని తుమ్మగూడ పంచాయతీ పరిధిలోని రాంజీగూడ, సిరికొండ మండలం కుంటగూడ, ఆదిలాబాద్ మండలంలోని కొత్తుర్ గ్రామానికి చెందిన ఆది వాసీలు గురువారం జంగున్‌బుయ్యారి దేవస్థానికి వెళ్లి సంప్రదాయ వాయిద్యాల మధ్య పూజలు చేశా రు. పుష్యమాసం ముగింపు వరకు ఈ పూజలు కొనసాగుతాయని ఆదివాసీలు తెలిపారు. పూజార్లు తొడసం బండు, జుగాదివార్ తదితరులు ఉన్నారు.

బావాపూర్(ఆర్)లో కాకతీయుల ఆనవాళ్లు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామ శివారులో కాకతీయ అనంతర కాలానికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపె రాజ్‌కుమార్ గ్రామ శివారులో గురువారం పర్యటించారు. పలు ఆనవాళ్లను గుర్తించారు. ఈ ప్రాంతంలో అత్యంత అరుదైన ప్రాచీన గణపతి శిల్పాన్ని గుర్తించారు. ఈ శిల్పం లలితాసనం, చతుర్భుజు డు, అంకుశం, గొడ్డలి, దంతం, ఉండ్రాళ్లతో చేతులు, ఉదరంపై నాగబంధం ఉన్నాయని వివరించా రు. వీటి ఆధారంగా ఇవి ముమ్మాటికీ కాకతీయుల అనంతర కాలానికి సంబంధించినవిగా చెప్పవచ్చని తెలిపారు. మరిన్ని ఆనవాళ్లు ఉన్నప్పటికీ గు ర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉండే ఖానాపూర్ ప్రాంత అడవుల్లో ప్రాచీన విగ్రహాలు, కట్టడాలు చాలా ఉన్నాయని, వాటిని ఆర్కియాలజి శాఖ వారు వెలికి తీసి నేటి తరానికి తెలియజేయాలని కోరారు.



బావాపూర్(ఆర్) శివారులో కాకతీయులనాటి గణపతి విగ్రహం

ఆటోడ్రైవర్ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సమీపంలో ఈనెల 7న ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు ప్రాణాలను బలిగొన్న డ్రైవర్ పాలెపు రాకేశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బోథ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన పాలెపు రాకేశ్ మంగళవారం తన ఆటోలో గ్రామస్తులను మొక్కులు చెల్లించుకునేందుకు దేగామ పోచమ్మ ఆలయానికి తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో రాకేశ్ అతిగా మద్యం తాగి అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో మూలమలుపు వద్ద బోల్తాపడింది. ఈఘటనలో మహిళ అడెల్ల అక్కడిక్కడే మృతిచెందగా, మైలారపు అరుణ్, అయిల ఆశన్నలు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ముగ్గురి మృతికి కారణమైన రాకేశ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో బజార్‌హత్నూర్ ఎస్సై అప్పారావ్, ఏఎస్సై ధరంసింగ్, చంపత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ లారీల అడ్డగింత

జైపూర్: మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు లారీలను రామారావుపేట వాసులు గురువారం అడ్డుకున్నారు. రామారావుపేట నుంచి గోదావరి నది సమీపంలో పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించారు. ఐకే–ఓసీపీ మట్టిని గోదావరి నది సమీపంలో డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లుగా నిర్మించుకున్న రోడ్డును తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సౌకర్యార్థం ఈ రోడ్డును అలాగే ఉంచాలని కోరారు. కాగా, లారీల అడ్డుకోవడంతో స్థానికులు, అధికారులు మధ్య వాగ్వాదం జరిగింది. ఉన్నతాధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

క్లుప్తంగా

ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సాయం



బాన్సువాడ: న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం అందించాలని బాన్సువాడ కోర్టు జడ్జి టీఎస్‌పీ భార్గవి అన్నారు. గురువారం బాన్సువాడ కోర్టులో బార్‌ అసోసియేషన్‌, లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్స్‌ ఆధ్వర్యంలో న్యాయవాదులతో న్యాయ సేవాధికార సంస్థకు సంబంధించిన విషయాల గురించి చర్చించారు. జడ్జి మాట్లాడుతూ.. న్యాయ సహాయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ అసిస్టెంట్‌ ప్లీడర్‌ లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు ఖలీల్‌, మోహన్‌రెడ్డి, మొగులయ్య తదితరులున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ అప్పగింత



మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం అప్పగించినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. గజ్యానాయక్‌ తండా చౌరస్తాకు చెందిన షారుక్‌ ఫోన్‌ పోగొట్టుకోగా సీఈఐఆర్‌ ద్వారా గుర్తించి అప్పగించారు.

ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



నిజాంసాగర్‌(జుక్కల్‌): బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్‌ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ సహకారంతో మహమ్మద్‌నగర్‌ మండలంలోని నర్వ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన బోరు మోటార్ల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కోరినట్లు బీజేపీ నాయకులు రాంప్రసాద్‌, గోర్గంటి రాములు, సాయిబాబా తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తరలిన క్రీడాకారులు



కామారెడ్డి టౌన్‌: మహారాష్ట్రలో ఈ నెల 13 వరకు జరిగే 68వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ జట్టు తరఫున క్రీడాకారులు గురువారం కామారెడ్డి రైల్వే స్టేషన్‌ నుంచి తరలివెళ్లారు. గత ఏడాది నవంబర్‌ 3 నుంచి 5 వరకు సదాశివనగర్‌ మండలం పోసానిపేట గ్రామంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను నిర్వహించి తెలంగాణ టీంను ఎంపిక చేశారు. అండర్‌–14 బాలికల విభాగంలో శ్రీలత, స్నేహ, వైష్ణవి, అలేఖ్య, వర్షిత, నేహ, శ్రీనిధి, నవ్యశ్రీ, భావన, తనూజా, సహస్ర, అంజలిలు తెలంగాణ జట్టు తరఫున జాతీయ స్థాయి పోటీలో పాల్గొననున్నారు. జట్టుకు కోచ్‌గా కోచ్‌గా నరేష్‌ రెడ్డి, మేనేజర్‌గా ప్రతిభలు వ్యవహరించనున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



కామారెడ్డి అర్బన్‌: పట్టణంలోని విద్యానగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం రోటరీ ఆడిటోరియంలో కాలనీ మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఎంజీ.గీత, ద్వితీయ బహుమతి కె.మానస, తృతీయ బహుమతి ఎం.లావణ్య, ప్రత్యేక బహుమతి ఎం.షీలా గెలుపొందారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వంద మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. బహుమతుల దాతలు ఎం.రాజేశ్వర్‌, మోతె వెంకటేష్‌గౌడ్‌లను అసోసియేషన్‌ అధ్యక్షుడు మారవేణి రాజన్న అభినందించారు. వైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కాలనీ కార్యదర్శి వి.విశ్వనాథం, కోశాధికారి పార్శి వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఎ.బాలకిషన్‌, బి.మురళి, మోహన్‌లాల్‌ పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్‌ పాఠశాలలో..

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని బ్లూబెల్స్‌ పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు సంజీవ్‌రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు.

మాచారెడ్డి ప్రాథమిక పాఠశాలలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటాచారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ కుమార్‌, తదితరులు ఉన్నారు.

త్వరలో 'భూ భారతి' అమలు!

- ఆమోదం తెలిపిన గవర్నర్‌
- నూతన చట్టం విధానాలు



నిజామాబాద్‌ అర్బన్‌: రాష్ట్రంలో భూ భారతి చట్టం అమలులోకి రానుంది. ఈ చట్టానికి ఇటీవల గవర్నర్‌ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ధరణి రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకు వస్తుంది. నూతన చట్టాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో కొత్త విధానంలో ఏ అంశాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ధరణి పోర్టల్‌ పేరును భూ భారతిగా మార్చారు. వారసత్వ బదిలీ మినహా అన్ని లావాదేవిల్లో ఏకకాల రిజిస్ట్రేషన్‌, మ్యుటేషన్‌ సేవలు కొనసాగనున్నాయి. మ్యుటేషన్‌పై అభ్యంతరాలను సైతం సేకరించేల అప్పీలకు అవకాశం ఇచ్చారు.

పట్టా భూముల సమస్యలు

భూ భారతి పోర్టల్‌లో భూముల లావాదేవిలకు అనుమతి ఇస్తారు. సాగులో ఉండి హక్కులకు రాని వాటికి హక్కులు కల్పిస్తారు. ఆర్‌ఓఆర్‌ 1971 కింద పాస్‌పుస్తకాలు ఉన్నవారికి కొత్త చట్టంలోని హక్కులు కల్పిస్తారు. ఖాతాలో తేడాలు, సర్వే నంబర్‌లో తప్పులు, రికార్డుల్లో భిన్నంగా సాగు వేరే చోట ఉండడం, తదితర సమస్య ఉన్నప్పటికి అసలు సాగుదారుల పేరు మీద హక్కులు కల్పిస్తారు.

పార్ట్‌– బి వివాదాలు

హద్దులు, సమస్యలు, సర్వేలో లోపాలు, చిన్నచిన్న వివాదాలు, మ్యుటేషన్‌ ఫిర్యాదులు వంటివి అధికారులు విచారణ చేపడుతారు. దీనికి కోసం మూడు రకాల పరిష్కార మార్గాలను కల్పించారు. సులభతరంగా ఉన్న సమస్యలను తహసీల్దార్‌ స్థాయిలో మధ్యస్తంగా ఉన్న సమస్యలను ఆర్‌డీవో స్థాయిలో, తీవ్రస్థాయిలో ఉన్న సమస్యలను కలెక్టర్‌ స్థాయిలో పరిష్కరించేలా సెక్షన్లు ఏర్పాటు చేశారు. సుమారు 23 రకాల భూ యజమాన్యాలకు సంబంధించిన పరిష్కారాలు చూపారు. ఈ నేపథ్యంలో అభ్యంతరాలు తలెత్తితే అప్పీలు చేసుకునే అవకాశం ఉంది.

వారసత్వ బదిలీ

పాత చట్టంలా కాకుండా భూ భారతిలో వారసత్వ బదిలీపై కుటుంబ సభ్యులకు తహసీల్దార్‌ నోటీసులు జారీ చేస్తారు. విచారణ జరిపి మ్యుటేషన్‌ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలుకు అవకాశం ఉంటుంది.

అసైన్డ్‌ భూములకు పట్టాలు

అసైన్డ్‌, లావణీ తదితర భూములకు సంబంధించి ఇందులో అవకాశం ఉంది. గతంలో వీటికి పాస్‌పుస్తకాలు జారీ చేయలేదని గుర్తించారు. తాజాగా రైతులు దరఖాస్తులు చేసుకోకున్న పట్టాపాస్‌పుస్తకాలు అయితే జారీ చేస్తారు. అవసరమైతే విచారణ జరుపుతారు.

అప్పీళ్ల వ్యవస్థ

18 రకాల భూములకు సంబంధించి యజమాన్య హక్కుల మార్పిడిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కోర్టుకు వెళ్లకుండా నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. 18 రకాల భూముల్లో ఆరు తహశీల్దార్‌, మిగిత భూములకు ఆర్‌డీవో మ్యుటేషన్‌ పూర్తి చేస్తారు. అంతేకాకుండా అభ్యంతరాలపై అప్పీలు పోయే అవకాశం కల్పించారు. తహసీల్దార్‌పై ఆర్‌డీవోకు, ఆర్‌డీవోపై కలెక్టర్‌కు, కలెక్టర్‌పై ల్యాండ్‌ ట్రిబ్యునల్‌ వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది.

మ్యుటేషన్‌పై..

ఒకరి చేతిలో భూములు ఉండగా రికార్డుల్లో పాత యజమానుల పేర్లు ఉంటే అడ్డుకోవచ్చు. మ్యుటేషన్‌ను రద్దుచేసే అవకాశం ఆర్‌డీవోకు ఉంటుంది. అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. రిజిస్టర్‌ దస్తావేజుల ద్వారా జరిగిన మ్యుటేషన్లలో తప్పులు ఉన్న ఆర్‌డీవోకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుంది.

కొత్త పాస్‌పుస్తకాల జారీ విధానం

రక్షిత కౌలుదారులకు, ఇనాం భూములకు ధ్రువీకరణ పత్రం ఇచ్చే అధికారాలు కలెక్టర్‌కు కల్పించారు. వేరువేరు చట్టాల ద్వారా హక్కులు దాఖలు పడిన సమయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆర్‌డీవో పాస్‌పుస్తకాలను జారీ చేస్తారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను తహశీల్దార్‌, ఆర్‌డీవో, కలెక్టర్లకు అప్పగించారు. అంతేకాకుండా క్రిమినల్‌, శాఖ పరమైన చర్యలు పాత చట్టం ప్రకారం కొనసాగుతాయి. ఈ చట్టం ద్వారా పాస్‌పుస్తకాల రద్దు కలెక్టర్‌కు అప్పగించారు.

కులమతాలకు ప్రతీక బడాపహాడ్‌



బడా పహాడ్‌ దర్గా




స్వాగత ద్వారం

- 11నుంచి ఉర్సు ప్రారంభం
- ఏర్పాట్లపై దృష్టిసారించని నిర్వాహకులు

వర్ని: ఉత్తర తెలంగాణలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన బడాపహాడ్‌ దర్గా కులమతాలకు ప్రతీకగా నిలుస్తోంది. వర్ని మండలం జలాల్పూర్‌ అటవీప్రాంతంలో దట్టమైన గుట్టల్లో కొలువై ఉన్న షాదుల్లా బాబా దర్గాను హిందూవులు, ముస్లింలు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. ప్రసిద్ధమైన ఈ దర్గాలో ఈనెల 11నుంచి ఉర్సు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది దర్గా వద్ద మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈక్రమంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు వెల్లడించారు. కానీ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి ఏటా దర్గా ద్వారా వక్ఫ్‌ బోర్డుకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యంగానే ఉంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో బోర్డు పూర్తిగా విఫలమైంది. వచ్చిన ఆదాయంలో 75% నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని నిబంధనలో ఉన్నప్పటికీ కనీసం 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉర్సు సమయంలోనే తూతూ మంత్రంగా నిధులు మంజూరు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

బలవంతపు వసూళ్లు..

దర్గాకు వచ్చే భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. వసతి కొరకు తీసుకున్న షెడ్ల దగ్గర నుంచి మేకలు కోయడం, దేవునికి నైవేద్యం సమర్పించడం, తలనీలాలు సమర్పించడం, కొబ్బరికాయలు, తాగునీరుకు సైతం డబ్బులు చెల్లించనిదే ఇక్కడ ఏ పని జరగదు. దర్గా వద్ద నైవేద్యం సమర్పించడానికి పూజారులు భక్తుల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఏ చిన్న వస్తువు కొనాలన్నా 100శాతం అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయంలో జోక్యం చేసుకొని తగిన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



బడాపహాడ్‌

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



ఎల్లారెడ్డిలో మాంజాను పరిశీలిస్తున్న ఎస్సై మహేష్‌



భిక్కనూరులో పరిశీలిస్తున్న ఏఎస్సై జగదీష్‌

ఎల్లారెడ్డి: చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేష్‌ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో పతంగులు విక్రయిస్తున్న దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాలలో అమ్ముతున్న మాంజాను ఆయన పరిశీలించారు. దుకాణాలలో చైనా మాంజా విక్రయించొద్దని, దీని వల్ల ప్రజలతో పాటు, పక్షులు, జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని అన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలో పతంగులు విక్రయించే దుకాణాలను భిక్కనూరు ఏఎస్సై జగదీష్‌ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా విక్రయించవద్దని సూచించారు.

నిజాంసాగర్‌(జుక్కల్‌): చైనా మాంజాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని జుక్కల్‌ ఎస్సై భువనేశ్వర్‌ హెచ్చరించారు. గురువారం జుక్కల్‌ మండల కేంద్రంలోని పతంగుల విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. మామూలు దారాలను విక్రయించాలని సూచించారు.



జుక్కల్‌లో ఎస్సై భువనేశ్వర్‌..

తాగి రోడ్డెక్కితే కటకటాలపాలే..!

- జిల్లాలో విస్తృతంగా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు
- 2024లో 7,698 కేసులు.. 165 మందికి జైలు శిక్ష



ఖలీల్‌వాడి: మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై చట్టం కొరఢా ఝుళిపిస్తోంది. పోలీసులు విస్తృతంగా డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపడుతుండగా, న్యాయస్థానాలు సైతం జరిమానా, జైలు శిక్షలు విధిస్తున్నాయి. మందుబాబులపై చట్టం కఠినంగా వ్యవహరిస్తున్నా కొందరు మారడం లేదు. నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 2024లో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు 7698 నమోదు కాగా, 165 మందికి ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజుల ఇలా జైలు శిక్షలు ఖరారయ్యాయి. రూ.88.90 లక్షల జరిమానా విధించారు. 2023లో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో 14 మంది జైలు శిక్ష పడగా, 2024లో ఆ సంఖ్య 151కి చేరడం గమనార్హం.

మూడేళ్లలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానాలు	జైలు శిక్ష
2022	12,080	1,63,57,994	20
2023	8,706	77,89,089	14
2024	7,698	88,90,451	165

రోడ్డు ప్రమాదాల్లో 335 మంది మృతి

మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జిల్లాలో ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. 2024లో కమిషనరేట్‌ పరిధిలో 322 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 335 మంది మృతి చెందారు. చాలా మంది మద్యం మత్తులో వాహనాలు నడిపి, మద్యం సేవించడం, హెల్మెట్‌లు ధరించకపోవడం తదితర కారణాలతో మృతి చెందినట్లు పోలీసులు తెలుపుతున్నారు. 2023తో పోలిస్తే 2024లో రోడ్డు ప్రమాదాలు 3.20శాతం పెరిగాయి. కమిషనరేట్‌ పరిధిలో ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేకంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీల సమయంలో బ్రీత్‌ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన చట్టం సెక్షన్‌ 185 ద్వారా కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తారు. బ్రీత్‌ ఎనలైజర్‌ (మద్యం శాతం) రిజల్ట్‌ ఆధారంగా సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. బ్రీత్‌ ఎనలైజర్‌లో మద్యం శాతం 200 దాటితే ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు మేజిస్ట్రేట్‌ జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశమైన కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు



మత్తమాలలో మాట్లాడుతున్న సత్యనారాయణ



నందివాడలో సమావేశమైన కాంగ్రెస్‌ నేతలు

- పలు మండలాల్లో కాంగ్రెస్‌ సమావేశాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్‌ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సాయికుమార్‌, అట్టెం శ్రీను పిలుపునిచ్చారు. గురువారం మాలోత్‌తండా, ఎక్కపల్లితండా, ముస్తాపూర్‌, ఎల్లారం, పర్మళ్ల, భవానిపేట, కోమట్‌పల్లి, సురాయిపల్లి, కొండాపూర్‌ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు.

26 నుంచి రైతుభరోసా

ఎల్లారెడ్డిరూరల్‌: ఈ నెల 26 నుంచి రైతులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతు భరోసా అందించనున్నట్లు మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కుడుముల సత్యనారాయణ అన్నారు. గురువారం మత్తమాల, రుద్రారం, బ్రాహ్మణపల్లి, అల్మాజీపూర్‌ గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు సైతం రూ.12 వేలు అందిస్తుందన్నారు. మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్‌, వెంకట్రాంరెడ్డి ఉన్నారు.



సదాశివనగర్‌లో పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

భారీ మెజార్టీతో గెలిపించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. నందివాడలో గురువారం కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు లక్ష్మణచారీ, శివాజీ, రాజీవ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్‌ పరిధిలో..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు అడ్లూర్‌ ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విండో చైర్మన్‌ సదాశివరెడ్డి, నాయకులు ఇర్షాదొద్దిన్‌, సురేష్‌, రూపేందర్‌ రెడ్డి, సిద్దిరాములు, సాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొనారు.

తెలుగు ప్రజల ప్రత్యేక పండుగ సంక్రాంతి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణ తార

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ప్రత్యేకమని జిల్లా బీజేపీ అధ్యక్షులు అరుణ తార అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రామాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు విజేతలేనని అన్నారు. ఎంత మంది పాల్గొన్నా గెలిచేది ఒక్కరేనన్నారు. ముగ్గుల పోటీల నిర్వహించిన బీజేపీ నేత శశాంక్‌ను అభినందించారు. ఉల్లెంగ సునంద మొదటి బహుమతి రూ.2516, రెండో బహుమతి వైష్ణవి రూ.1616, మూడో బహుమతి ప్రణీత రూ.1116 నగదు అందించి సన్మానించారు. మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్‌, మహిళా మోర్చ అధ్యక్షులు సావిత్రి, నాయకులు మేకల రాములు, అరిగె నారాయణ, గుత్తుల శ్రీనివాస్‌, సాయాగౌడ్‌, శంకర్‌, మల్లేష్‌, తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న అరుణ తార

తప్పిపోయిన పిల్లలు, తల్లికి అప్పగింత

కామారెడ్డి టౌన్‌: రోడ్డు పక్కన ఏడుస్తూ ఉన్న ఇద్దరు చిన్నారులను గమనించిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియ వారిని తల్లికి వద్దకు చేర్చిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. అంచనూర్‌ గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి మున్సిపల్‌ కార్యాలయం పక్కన వీధిలో ఉన్న మీ–సేవ కేంద్రానికి పని మీద వచ్చింది. తల్లికి చెప్పకుండా ఆ ఇద్దరు చిన్నారులు అక్కడి నుంచి ఆడుకుంటూ మున్సిపల్‌ కార్యాలయం ముందు రోడ్డు వద్దకు వచ్చి అయోమయానికి గురయ్యారు. ఎటు పోవాలో తెలియక రోడ్డు పక్కన ఏడుస్తూ ఉండిపోయారు. అప్పుడే కార్యాలయంలోకి వస్తున్న చైర్‌పర్సన్‌ ఆ చిన్నారులను గమనించి దగ్గరకు తీసుకుని ఓదార్చింది. కాసేపు అక్కడే సిబ్బందితో పిల్లల వెంట వచ్చిన వారు ఎవరోనని వెతికించింది. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. 20 నిమిషాల తర్వాత తల్లి రావడంతో ఊపిరి పీల్చుకుని పిల్లన్ని అప్పగించారు. తల్లిని మందలించారు.



పిల్లలను ఓదార్చుతూ పోలీసులకు ఫోన్‌ చేస్తున్న చైర్‌పర్సన్‌ ఇందుప్రియ



వ్యవసాయ కమిషన్‌ చైర్మన్‌కు ఘన స్వాగతం

రైతు కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం సభ్యులు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్‌)లో నిర్వహించిన పసుపు రైతుల అవగాహన సదస్సుకు హాజరైన రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్‌ చైర్మన్‌ ఎం కోదండరెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఘన స్వాగతం పలికారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. – సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



కోదండరెడ్డిని సన్మానిస్తున్న మానాల



స్వాగతం పలుకుతున్న కలెక్టర్‌ హనుమంతు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కామారెడ్డి టౌన్‌: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గడ్డం ఇందుప్రియ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కౌన్సిలర్లు మమత, వంశీ, ఇమ్రాన్‌, ప్రిన్సిపాల్‌ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

కామారెడ్డి టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని 4వ వార్డు హరిజనవాడలో నూతన బోరు మోటార్‌ను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గడ్డం ఇందుప్రియ ప్రారంభించారు. కౌన్సిలర్‌ పిడుగు మమత, కాలనీవాసులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం..

- రోజుకు టీఎంసీ చొప్పున తగ్గుముఖం
- కాలువల ద్వారా 11,704 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి యాసంగి సీజన్‌లో కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి రోజుకు ఒక్క టీఎంసీ చొప్పున నీరు ఖాళీ అవుతోంది.

ప్రస్తుత యాసంగి సీజన్‌లో 15 రోజుల వ్యవధిలో 14 టీఎంసీల నీరు ఖాళీ అయింది. నీటి విడుదల ప్రారంభ సమయంలో రెండు రోజులు మాత్రమే టీఎంసీ కంటె తక్కువ నీటి వినియోగం జరిగింది. ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వార 700 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిప్టు ద్వారా 525 క్యూసెక్కులు, గుత్ప లిప్టు ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిప్టు ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 416 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1087.00(66.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.